

విద్యార్థికి న్యాయం చేయాలని పీడీసీఎస్‌యూ ధర్నా

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: హైదరాబాద్ ఓ కార్పొరేట్ కళాశాలలో శనివారం మృతిచెందిన విద్యార్థికి న్యాయం చేయాలని, విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ ఆత్మహత్యలకు కారణమైన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు గడ్డం శ్రీకాంత్, బొజ్జె మారుతి, కొయ్యడ రాకేశ్, గాజుల అన్వేశ్, మిడిదొడ్డి అజయ్ పాల్గొన్నారు.

మేడారానికి 750 ప్రత్యేక బస్సులు

- రీజియన్ పరిధిలో ఏడు ఆపరేటింగ్ పాయింట్లు
- 18 నుంచి వారంరోజుల పాటు స్పెషల్ బస్సులు
- జీరో టికెట్‌తో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆర్టీసీ అధికారులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: రెండేళ్లకోసారి అత్యంత వైభవంగా జరుపుకునే సమ్మక్క-సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేస్తూ మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఈ యేడు మేడారం వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని, మేడారం వెళ్లే వారికోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని, ఈ బస్సుల్లో కూడా జీరో టికెట్‌తో మహిళలు ప్రయాణించవచ్చని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. దీంతో భక్తులు సంఖ్య పెరుగుతుందని అంచనా వేసిన ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌లో 750 ప్రత్యేక బస్సులను నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. రీజియన్ పరిధిలోని ఏడు ప్రాంతాల నుంచి ఎక్కువగా మేడారం వెళ్లే భక్తులుంటారని భావించిన ఆర్టీసీ అధికారులు ఆయా ప్రాంతాల నుంచి భక్తులను మేడారంకు తరలించేందుకు ఆపరేటింగ్ పాయింట్లను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని గోదావ రిఖని, హుస్నాబాద్, హుజురాబాద్, కరీంనగర్, మంథని, పెద్దపల్లి, వైటింక్లయిన్ కాలనీలో ఆపరేటింగ్ పాయిం ట్లను ఏర్పాటు చేసింది. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు 750 ప్రత్యేక బస్సులను ఈ ఏడు ఆపరేటింగ్ పాయింట్ల ద్వారా నడిపిస్తారు. ఇప్పటికే కరీంనగర్ రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) ఎన్.సుచరిత అధి కారులు, డిపో మేనేజర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడ, కొమురవెల్లి, కొండగట్టు తదితర ప్రాంతాలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సేవలను అందిస్తున్న అధికారులు మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర పూర్తయ్యే వరకు ప్రత్యేక బస్సులను నడిపిస్తామని ప్రకటించారు. ఈనెల 18 నుంచి ప్రారంభించే మేడారం ప్రత్యేక బస్సు సేవలను భక్తులు, మహిళలు జీరో టికెట్‌తో ప్రయాణసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





పెళ్లి సందడి

- నెల రోజుల్లో 13 వివాహ ముహూర్తాలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11: శూన్య మాసమైన పుష్యమాసం శుక్రవారంతో ముగిసి, శనివారంతో మాఘమాసం ప్రారంభమైంది. మాఘ మాసంతో పాటు మార్చి 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఫాల్గుణ మాసంలో వివాహాది శుభ కార్యాలకు ముహూర్తాలు ఉన్నాయి. మాఘ మాసంలో ఫిబ్రవరి 12 నుంచి మార్చి 10 వరకు 13 వివాహ, 17 గృహప్రవేశ, ఇతరత్రా కార్యాల నిర్వహణకు శుభముహూర్తాలున్నాయి. ఆదివారం ఒక్కో ఇంటికి సుమారు 4 నుంచి 5 చొప్పున వివాహాది శుభకార్యాలకు చెందిన ఆహ్వాన పత్రాలు అందాయి. శుభ ముహూర్తాలలో భాగస్వామ్యం వహించే అన్నివర్గాల వారికి గిరాకీ పెరిగింది.

కోరిన కోర్కెలు తీర్చే వెంకన్న

- మార్కెట్ రోడ్ వేంకటేశ్వర ఆలయానికి పలు ప్రత్యేకతలు
- 14 నుంచి బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11: నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పలు ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ నెల 14 నుంచి 21 వరకు బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంపై ప్రత్యేక కథనం.. 150 సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించారని అర్చకులు చెబుతారు. ఆనాటి తహసీల్దార్ ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో శ్రీభూదేవీ సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులు మూడు బేరాలున్నాయి. అందులో మూలమూర్తి ముందు ఒక శాశ్వత బేరం ఉంటుంది. ఆలయంలో సాలగ్రామలున్నాయి. స్వామి ముందు జయవిజయులు దర్శనమిస్తారు. ప్రతి శనివారం, విశేష పర్వదినాల్లో ఆలయంలో భక్తుల రద్దీ ఉంటుంది. నగరంలో ఒకటే ఒకటిగా చెప్పుకునే లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని 1961లో వ్యాపారవేత్త గౌరిశెట్టి రాజేశం కట్టించారు. ఆలయంలో జైపూర్ పాలరాతితో రూపొందించిన స్వామివారి, అమ్మవారి విగ్రహాలు ఉన్నాయి. శ్రీరామ, దసరా నవరాత్రులు, ప్రతీ నెలలో వచ్చే రెండు ఏకాదశి తిథులకు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. ఈ సారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి వుడుతల వెంకన్న తెలిపారు.



విద్యుత్ దీపాల వెలుగులో మార్కెట్ రోడ్ వేంకటేశ్వర ఆలయం

ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం..

\- మంత్రి పొన్నం ప్రభాకర్



అందరం కలసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం. అన్ని శాఖల అధికారులు, నగర ప్రముఖులు, దాతలు, పలు సంస్థల బాధ్యులు, వేదపండిత, అర్చక బృందంతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించాం. నేను కూడా ఓ మామూలు భక్తుడి లాగే ఉత్సవాల్లో పాల్గొంటాను. ఉమ్మడి జిల్లా ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలి.

కన్నుల పండువగా వేంకటేశ్వర కల్యాణం

వీణవంక, ఫిబ్రవరి 11: మండలంలోని మామిడాలపల్లిలో వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు నమిలి కొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడి బియ్యం మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమములో ఆలయ చైర్మన్ సత్యనారాయణ, అర్చకులు సంతోష్, మూల పుల్లారెడ్డి, బండ కిషన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మావురపు విజయ భాస్కర్‌రెడి పాల్గొన్నారు.



మామిడాలపల్లి గ్రామంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

భగత్‌నగర్, ఫిబ్రవరి 11: కరీంనగర్‌లోని ఆర్టీసీ-2 డిపో వద్ద కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆర్టీసీ నాయ కులు, సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి నాలుగువేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. 2013 సంవత్సరం నుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేయడంతో కార్మికులకు ఊరట లభించింద న్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జక్కుల మల్లేశం, రీజినల్ జనరల్ సెక్రెటరి టీఆర్ రెడ్డి, కాసర్ల ప్రభాకర్, కేజీ సాగర్‌రెడ్డి, ఎంఆర్ రెడ్డి, పరమేశ్వర్, హెచ్ రవీందర్, రాములు, రహీం, డీఎస్‌రావు, వీఎల్ నారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 11: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడంపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌక్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్య రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని, విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి 7.8 శాతం మాత్రమే కేటాయించిందని విమర్శించారు. ఈ నిధులతో ప్రభుత్వ విద్య ఏమాత్రం అభివృద్ధి చెందదన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన 7,200 కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని, ప్రభుత్వం వెటనే వాటిని విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సంవత్సర కాలంగా చార్జీలు చెల్లించలేదన్నారు.. గురుకులాల్లో సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా సహాయ కార్యదర్శి మనోజ్, నాయకులు బోగేష్, చందు, వరుణ్, ఆకాష్, రాకేష్, రాజు, నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన శాఖ మంత్రి సీతక్క



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 1 : హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఆదివారం వరంగల్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న క్రమంలో మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కాంగ్రెస్‌నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ నివాస గృహంలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా వొడితెల ప్రణవ్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రికి వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ దొంత రమేష్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చందమల్ల బాబు, మాజీ సర్పంచ్ రఘుపాల్‌రెడ్డి, చందమల్ల నరేష్ పాల్గొన్నారు.

12 మంది ఎంపీడీవోల బదిలీ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సొంత జిల్లాల్లో మూడేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని 12 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ ఈనెల 12న వారిని రిలీవ్ చేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన ఎంపీడీవోలు ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, సి రవీందర్‌రెడ్డి, రేవూరి పద్మావతి, అవునూరి స్వాతి, ఇనుకొండ స్వరూప, వేముల విజయలక్ష్మిని జగిత్యాల జిల్లాకు బదిలీ చేశారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రాను రాజన్న సిరిసిల్ల జిల్లాకు, తొడుపునూరి జయశ్రీని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. యాదగిరి భాస్కర్‌రావు, నీలగిరి దివ్యదర్శన్‌రావు, కొప్పుల శ్రీనివాస్‌ను పెద్దపల్లి జిల్లాకు, గుమ్మడి కల్పనను వరంగల్ జిల్లాకు బదిలీ చేశారు.

ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11: నగరంలోని అశోక్ నగర్‌లో గల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆల యంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పారువెల్ల ఫణిశర్మ ఆధ్వర్యంలో నిత్య విధి పూజ, మూల విగ్రహానికి భక్తులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం గణపతిపూజ, అమ్మవారికి అలంకరణ, కలశస్థాపనం, వాసవి హోమం జరిగింది. పూర్ణాహుతి అనంతరం తీర్థ ప్రసాద, మహాప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చిట్టుమల్ల శ్రీనివాస్, కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, సంకటహర చతుర్థి కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- ఎండుతున్న పంటలు
- బావుల్లో పూడికలు తియ్యడానికి సిద్ధమవుతున్న రైతులు..

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: మండలంలోని అన్ని గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వ్యవసాయ బావులపై, బోర్లపై నమ్మకంతో రైతులు వరి పంటలు వేశారు. ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్‌లో భూగర్భ జలాలు తగ్గుతాయి. ఈసారి ఫిబ్రవరిలోనే ఇలాంటి దుస్థితి రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైతులు ఎన్నో ఆశలతో వేసిన వరి పొలాలు నీళ్ల లేక ఎండిపోతున్నాయి. ఎంతో కొంత మేరకు నీళ్లు వస్తాయనే ఆశతో రైతులు వ్యవసాయ బావుల్లో పూడికలు తియ్యడానికి క్రేన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో వ్యవసాయ బావుల్లో పూడికలు తియ్యడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి రైతులను ఆదుకునేది. అలాంటి పథకాలను మళ్లీ అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా వరదా కాలువ పనులు పూర్తి చేసి ఈ ప్రాంత భూములకు సాగునీరివ్వాలని రైతులు అంటున్నారు.



వ్యవసాయ బావిలో పూడిక తీయడానికి ఏర్పాటు చేసిన క్రేన్

పూడిక తీయ్యడానికి నిధులు ఇవ్వాలి..

\- ఎలగందుల రాజయ్య, రైతు, నవాబుపేట

గతంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ బావుల్లో పూడిక తియ్యడానికి నిధులు ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధంగా నిధులు ఇవ్వాలి. బావుల్లో నీళ్ల లేక పొలాలు ఎండుతున్నాయి. వరద కాలువ పనులు పూర్తి చేసి ఉంటే మాకు ఈ ఇబ్బందులు ఉండేవి కావు.

శాశ్వత పరిష్కారం చూపించాలి..

\- తాళ్లపెల్లి చంద్రయ్య, రైతు, సుందరగిరి

ప్రతి యేడూ యాసంగిలో రైతులకు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈసారి ఫిబ్రవరిలోనే కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంత సాగునీటి సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలి.

గంగపుత్రుల హక్కులు కాపాడుతాం

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గంగ పుత్రుల హక్కులు కాపాడడానికి అనవరమైన కృషి చేస్తానని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన గంగపుత్రుల మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కుల సంఘ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానన్నారు. చెరువులు, కుంటలపై కేవలం గంగపుత్రులకు మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో గీచే వాడిదే చెట్టు అని హక్కు కల్పించామని, చేపలు పట్టే వారికే చెరువులు, కుంటలపై గంగపుత్రులు, మత్స్య కార్మికులకు హక్కులు ఉండాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ సెల్ అధ్యక్షుడు మిట్ల సాయికుమార్, పలువురు గంగపుత్ర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంబజార్ కాలనీకి చెందిన మంతెన అక్షయ్ (27) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్షయ్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి పరిశీలన జరిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. సంఘటనపై ఎస్‌ఐ మన్మథరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నటేశ్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మానకొండూర్, ఫిబ్రవరి 11: మండలంలోని శంషాబాద్ గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై గుర్తు తెలయని వాహనం ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని గ్రామపంచాయితీ సిబ్బంది ఎండీ హకీం ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

ఎండపల్లి, ఫిబ్రవరి 11: రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీ కొట్టడంతో మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన బోగ లచ్చయ్య(50) ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ప్రయాణికుల కోసం ఆటోను గ్రామంలోని ఒక స్టేజీ వద్ద పెట్టి ఇంటికి బయలుదేరాడు. వెల్గటూర్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు (ఏపీ 40 ఏఎన్7609) నడుచుకుంటూ వెళ్తున్న లచ్చయ్యను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తరుపున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ శ్వేత తెలిపారు.

డెంగ్యూతో బాలిక..

పెగడపల్లి, ఫిబ్రవరి 11: పెగడపల్లి మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన వేముల చతుర్వేద (7) అనే బాలిక ఆదివారం డెంగ్యూ జ్వరంతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరవెల్లి గ్రామానికి చెందిన వేముల పవన్ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ ఏడాది కాలంగా భార్యా పిల్లలతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వారం రోజులుగా చతుర్వేద డెంగ్యూ జ్వరం బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.



చతుర్వేద (ఫైల్)

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

మానకొండూర్, ఫిబ్రవరి 11: అంతర్ జిల్లా దొంగల ముఠాను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పోలీసుల అదుపులో అంతర్ జిల్లా దొంగల ముఠా అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని సదాశివపల్లి వద్ద శనివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టాను. ఆ సమయంలో ఓ కారు (టీఎస్ 21డి 7715)లో ఇద్దరు దాని వెనకాల స్కూటీపై ఒక్కరు వస్తుండగా వాహనాలను పోలీసులు నిలిపివేశారు. వాహనాలను తనిఖీ చేయగా అందులో ఇన్వర్టర్, ఉడెన్ టేబుల్, రాగి వైరు కట్టతో పాటు స్కూటీపై టేబుల్ ఫ్యాను ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో మానకొండూర్‌కు చెందిన కోండ్ర ఫణీందర్, కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన నెరువట్ల వెంకటేశ్, నెరువట్ల అజయ్, పర్వతం సతీష్ ఒక ముఠాగా ఏర్పడి కరీంనగర్ జిల్లాలోని మానకొండూర్, సైదాపూర్, జమ్మికుంట, హుజురాబాద్, కరీంనగర్‌రూరల్, ఎల్ఎండీతో పాటు పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలోని జూలపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాలలో విద్యుత్ మోటార్లు, వాటి పరికరాలను దొంగిలించిగా 27 కేసులు నమోదు అయినట్లు తేలింది. దొంగిలించిన వస్తువులను మానకొండూర్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సిరిగిరి వెంకటమ్మ, కరీంనగర్‌లోని అల్కాపురి కాలనీకి చెందిన టేకు మల్లేశం, కోతిరాంపూర్‌కు చెందిన లోకిని లక్ష్మికి విక్రయించారు. కొనుగోలు చేసిన వ్యక్తులతో పాటు ముఠా సభ్యుడు అజయ్‌పై కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద ఉన్న కారు, స్కూటీ, రాగివైర్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకునేందుకు కృషి చేసిన మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అభినందించారు.

భక్తురాలి బంగారం చోరీ

వేములవాడ, ఫిబ్రవరి 11: రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం వేములవాడకు వచ్చిన వరంగల్ జిల్లాకు చెందిన రామక్క అనే 70 సంవత్సరాల వృద్ధురాలిని నమ్మించి బంగారం కాజేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రాజన్నను దర్శించుకున్న అనంతరం జాతర గ్రౌండ్ వైపు నడచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని గమనించిన నిందితుడు మీ గది పక్కనే తాము కూడా ఉన్నామని నమ్మించి ద్విచక్ర వాహనంపై ఎక్కించు కున్నాడు. జగిత్యాల బస్‌స్టాండ్ వైపు తీసుకెళ్లి దాదాపు మూడున్నర తులాల బంగారు గొలుసును లాకున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. నిందితుడు మెరున్‌కలర్ చెక్స్ ఉన్న షర్టు, ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. రాజన్న సన్నిధికి వచ్చిన భక్తులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

చందుర్తి, ఫిబ్రవరి 11: కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీపై కుట్రలు చేస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా ఆదివారం రెండో రోజు చందుర్తి మండలం లింగంపేటలో ప్రారంభమైంది. కట్టలింగంపేట, మల్యాల, చందుర్తి, రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో యాత్ర కొనసాగింది. ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా కట్టలింగంపేటలో రేషన్ దుకాణంలో బండి సంజయ్ పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు రాగానే రెండు పార్టీలు ఒక్కటవుతాయని, పైకి మాత్రం తిట్టుకుంటారని అన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ ఇప్పటి వరకు అభ్యర్థిని పెట్టలేదని, కేవలం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉండడానికి చూస్తోందని అన్నారు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని కాంగ్రెస్ ప్రచారం చేసిందన్నారు. బీజేపీని బదనాం చేయడానికే కుట్ర చేశారన్నారు. బీజేపీ అత్యధిక స్థానాలు గెలవనున్నట్లు సర్వేలు వచ్చాక వాళ్లకి మనసున పడడం లేదన్నారు. తమది బీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకునే మూర్ఖత్వం పార్టీ కాదన్నారు. ఒంటరిగా పోటీ చేస్తున్నామని చెప్పుకునే దమ్ము బీఆర్ఎస్‌కు లేదన్నారు. తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమనే ప్రజలు గమనించాలన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేశాయన్నారు. ఫామ్ హౌస్‌లో ఉంటున్న కేసీఆర్ మళ్లీ కుట్రలు చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి ఒక్క ఎంపీ సీటు రాదని, తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టారని అన్నారు. బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ చూశాక ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. ఈ నెల చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, ఎన్నికల షెడ్యూల్ అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై కాలయాపన చేస్తుందని అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ లేని దేశాన్ని ఊహించుకోలేమన్నారు. మేడిగడ్డ కుంగడంపై లక్ష కోట్లు ఖర్చు చేసి ప్రజల ధనం వృథా అయితే బీఆర్ఎస్ చిన్న సమస్య అంటోందన్నారు. కాంగ్రెస్ ఎందుకు విచారణకు ఆదేశించడం లేదన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా ఊహించుకోవడం కష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నాయకులు పోంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, కటకం లోకేష్, పెరిక గంగరాజు, ఎర్రం మహేష్, రేగుల మల్లికార్జున్, చింతకుంట గంగాధర్, లోకోజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బండి సంజయ్

మోదీ ప్రభంజనంలో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు


దుంపెటలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎంపీ బండి సంజయ్

కథలాపూర్: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రభంజనం మూడో సారి వీస్తుందని అందులో ప్రతిపక్షాలు కొట్టుకుపోవడం తథ్యమని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా రెండోరోజు మండలంలోని సిరికొండ నుంచి ఆరంభం కాగా విలేకరులతో కాసేపు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పరిస్థితి ఎప్పటికీ తలెత్తదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందని మునిగిపోయిన నావతో సంబంధాలు ఎలా పెట్టుకుంటామని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ అధ్వానంగా ఉందని ఆరు గ్యారంటీలకు కావల్సిన వ్యయం, కేటాయించిన నిధులకు భారీ తేడా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పరిపాలన చేతకాదని ఈ బడ్జెట్ రూపకల్పనతో తేలిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని ప్రజలు విసుగెత్తిపో యారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాయకులు, యువత పకడ్బందీగా పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థిక అభివృద్ధిలో పురోగమనంకు బాటలు వేసినట్లు చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో నిర్వహించిన సర్వేలైనా బీజేపీ విజయం సాధిస్తుందని చెబుతున్నాయన్నారు. అనంతరం సిరికొండ, దూలూరు, దుంపెట, తాండ్ర్యాల, అంబారిపేట, కలికోట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాహిత యాత్రలో చిన్నారులను ఎత్తుకున్నారు. మహిళలు, వృద్ధులకు అభివాదం తెలిపారు. పలు గ్రామాల్లో శివాజీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెల్ఫీలు దిగేందుకు యువకులు పోటీపడ్డారు. గ్రామాల్లో ఎంపీకి డీజే చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. వాడల్లో తిరుగుతూ నమస్కరించారు. గడిచిన ఐదేళ్లలో పార్లమెంట్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, ధన్‌పాల్ సూర్యనారాయణ, ప్రవీణ్, జలంధర్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు

- అత్తింటివారిపై భర్త దాడి.. ఆత్మహత్యాయత్నం


గొంతుకోసుకున్న కళాధర్

బోయినపల్లి, ఫిబ్రవరి 11: భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. భర్త తీరు మారకపోవడంతో భార్య విడాకులు కోరింది. నిరాకరించిన భర్త ఆమె ఇంటికి చేరుకొని చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేసి బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. బోయినిపల్లి మండలం రామన్న పేటగ్రామంలో ఆదివారం చోటు చేసుకున్న సంఘటన వివ రాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట గ్రామానికి చెందిన శ్వేతకు ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటకు చెందిన సామ కళాధర్‌రెడ్డికి 2021లో వివాహమైంది. ఆరు నెలల అనంతరం కళాధర్ మద్యానికి బానిసయ్యాడు. భార్యశ్వేతను వేధించ సాగాడు. భర్త తీరు మారకపోవడంతో శ్వేత పెద్ద మనుషుల సమక్షంలో నిర్వహించిన పంచాయితీలో విడాకులు కోరింది. ఆదివారం తెల్లవారుజామున కళాధర్ శ్వేత ఇంటికి వచ్చి చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. తలుపులు తీయకపోవడంతో కళాధర్ వెంట తెచ్చుకున్న బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని 108 ద్వారా సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. కళాధర్ హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. శ్వేత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూగజీవాలపైకి దూసుకెళ్లిన లారీ

- 40 గొర్రెలు మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: మండలంలోని చిగురుమామిడి గ్రామపంచాయితీ పరిధిలోని రాజన్నపల్లి వద్ద ఆదివారం గ్రానైట్ లారీ ఢీకొన్న ప్రమాదంలో 40 గొర్రెలు మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. చిగురుమామిడికి చెందిన సౌదం కనుకయ్య, ముదుకిరి సమ్మయ్య గ్రామ శివారులో గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం వేళ ఇంటికి తరలిస్తుండగా కరీంనగర్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ(టీఎస్ 02 యూఏ 6438) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేచపల్లిలో కలకలం..

- పోలీసుల అదుపులో పౌర హక్కుల సంఘం నేత రాజేశం
- నాటకీయ పరిణామాల మధ్య ఛత్తీస్‌గఢ్‌కు తరలింపు
- కిడ్నాపర్లుగా భావించి పోలీసులకు గ్రామస్థుల సమాచారం

అది జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచపల్లికి వెళ్లే రోడ్డు.. ఆదివారం తెల్లవారు జామున ఆ రోడ్డుపై రెండు నంబర్‌ప్లేట్ లేని వాహనాలు కనిపించాయి. ఆ వాహనాల్లో నుంచి దిగిన ఎనిమిది మంది వ్యక్తులు హిందీలో ఏదో మాట్లాడుకుంటున్నారు.. అటువైపు వెళ్లిన బట్టపల్లి గ్రామానికి రైతులు వారిని గమనించి చిన్న పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చిన ముఠాగా భావించారు. ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. వారు వాహనాల్లో వచ్చిన వారిని నిలదీయడంతో తాము ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులమని తెలిపారు. దీంతో గ్రామస్థులు సారంగపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వచ్చి వారితో మాట్లాడి ఛతీస్‌గఢ్ పోలీసులు అని నిర్ధారించుకుని వెళ్లిపోయారు. అనంతరం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులు రేచపల్లికి వెళ్లి పౌరహక్కుల సంఘం నేత పోగుల రాజేశంను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది.

- ఆంధ్రజ్యోతి, జగిత్యాల/ సారంగాపూర్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా గీదం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కోశాధికారి రాజేశంను ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. దంతేవాడ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో గల ఓ కేసులో విచారణ కోసం తీసుకవెళ్తామని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఇదేమిటని కుటుంబసభ్యులు ప్రశ్నించినప్పటికీ బలవంతంగా రాజేశంను, అతని భార్య మల్లీశ్వరిని వాహనంలో తీసుకెళ్లారు. రేచపల్లి శివారులోకి వెళ్లిన అనంతరం రాజేశం భార్య మల్లీశ్వరిని వాహనం నుం చి దింపివేసి వెళ్లిపోయారు. రాజేశంను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుళ్లారని ఆయన మల్లీశ్వరి, కుటుంబ సభ్యు లు అంటున్నారు. ఈ విష యమై సారంగపూర్ ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ రేచపల్లి గ్రామానికి వచ్చి రాజేశంను తీసుకవెళ్లింది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా గీదం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిగా ధ్రువీకరిం చుకున్నామని తెలిపారు. తీవ్రవాదానికి సంబందించిన ఓ కేసులో నిందితుడిగా ఉన్న రాజేశంను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేశారన్నారు.


పోగుల రాజేశం




ఛత్తీస్‌గఢ్ పోలీసులు రేచపల్లికి వచ్చిన నంబరు లేని వాహనం, రాజేశంను ఇంటికి పంపాలని వేడుకుంటున్న భార్య, కుమారుడు

● రాజేశంను వెంటనే విడిచిపెట్టాలి

- రాజేశం భార్య మల్లీశ్వరి, కుమారుడు శ్రీనివాస్

పౌరహక్కుల సంఘం నేత రాజేశంను వెంటనే విడిచిపెట్టాలని ఆయన భార్య మల్లీశ్వరి, కుమారుడు శ్రీనివాస్‌లు కోరుతున్నారు. ఆదివారం జగిత్యాల డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. రేచపల్లి గ్రామానికి గుర్తు తెలియని వాహనాల్లో వచ్చిన కొందరు వ్యక్తులు బలవంతంగా రాజేశంను తీసుకవెళ్లారన్నారు. విషయాన్ని పోలీసులకు అందించగా ఛత్తీస్‌గఢ్‌కు ఓ కేసు విచారణలో రాజేశంను అక్కడి పోలీసులు తీసుకవెళ్లారని అంటున్నారని, తమకు సమాచారం లేదన్నారు. రాజేశంను వెంటనే విడిచి పెట్టాలని కోరారు.

● రాజేశం కిడ్నాప్‌ను ఖండిస్తున్నాం

- కుమార స్వామి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

పోగుల రాజేశంను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి అన్నారు. ఆయన జగిత్యాలలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం లేకుండా పలువురు వ్యక్తులు ఛత్తీస్‌గఢ్ పోలీసులుగా చెప్పుకుంటూ రాజేశంను తీసుకవెళ్లడం సమంజసం కాదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఫోన్ ద్వారా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను సంప్రదించగా పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రాజేశంను అక్రమ నిర్బంధం నుంచి వెంటనే విడిపించాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రశ్నించే గొంతుకలుగా ఉన్న పౌర హక్కుల సంఘం కార్యకర్తలు, రచయితలు, జర్నలిస్టులు, మేధావులను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, ఉపాధ్యక్షుడు నార వినోద్, సహాయ కార్యదర్శి గడ్డం సంజీవ్ కుమార్, కార్యవర్గ సభ్యులు కడ రాజన్న, మోటపలుకుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో మహిళ ఆత్మహత్య

ధర్మారం, ఫిబ్రవరి 11: మండల కేంద్రానికి చెందని గోల్కొండ రాజేశ్వరి(37) తన రేకుల షెడ్డులో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన్ని సంవత్సరాల నుంచి ఆమె మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో ఆమె జీవితంపై విరక్తి చెంది తన రేకుల షెడ్డులో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. మృతురాలి భర్త రాజేశం జీవనోపాధి కోసం దుబాయ్‌లో ఉన్నాడు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. తల్లి నర్ర వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై 2 ఎస్ అశ్విని తెలిపారు.

ఆరెపల్లిలో చోరీ

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11: వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన శ్రీనివాస్ ఇంట్లో శనివారం అర్థరాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లాడు. భార్య బంధువుల ఇంట్లో నిద్రించింది. శనివారం ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా తాళం పగలగొట్టి ఇంట్లోని రూ. లక్ష నగదుతోపాటు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జనసంద్రంగా మారిన వేములవాడ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 11: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఆదివారం అశేష భక్తజనంతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. భారీ సంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

ఐఎంఏ ప్రెసిడెంట్‌కప్ విజేతలు సిటీ టైటాన్స్



ఐఎంఏ ప్రెసిడెంట్ కప్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన సిటీ టైటాన్స్‌జట్టు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11: ఐఎంఏ ప్రెసిడెంట్‌కప్‌ను సిటీ హాస్పిటల్ స్పాన్సర్ చేసిన సిటీ టైటాన్ జట్టు కైవసం చేసుకుంది. బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఐఎంఏ ప్రెసిడెంట్ కప్‌లో నాలుగు క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. విజేతలుగా సిటీ హాస్పిటల్ సిటీ టైటాన్స్ జట్టు గెలుచుకోగా, రన్నర్‌లుగా సన్‌రైస్ హాస్పిటల్ స్పాన్సర్ చేసిన సన్‌రైజెస్ జట్టు రెండవ స్థానంలో నిలిచింది. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌ను డాక్టర్ అమర్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్ పొలాస, కార్యదర్శి డాక్టర్ జి వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ జక్కని తిరుపతి, సీనియర్ వైద్యులు డాక్టర్ రఘురామన్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11: నేటి సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మహిళా శక్తి సమ్మేళన సమితి రాష్ట్ర బాధ్యులు అన్నారు. ఆదివారం నగరంలోని రెడ్డి ఫంక్షన్ హాలులో మహిళా శక్తి సమన్వయ సమితి కరినగరము విభాగ్ ఆధ్వర్యంలో మహిళా శక్తి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో మహిళా శక్తి సమ్మేళన సమితి రాష్ట్ర బాధ్యులు లింగం ఉజ్వల, జొన్నలగడ్డ నాగశ్రీ శారదాంబ, ఆధ్యాత్మిక వేత్త మాధవిలత పాల్గొని మాట్లాడారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం కోసం మహిళా సమ్మేళన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, పారిశ్రామిక, సామాజిక సేవ, విద్యా, వైద్య రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ మహిళలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ శేష శైలజ, బొడ్ల గీతారాణి, కోడూరి శ్రీవాణి, లెక్కల గీతా రెడ్డి, మహిళా శక్తి సమ్మేళనం కరీంనగర్ విభాగ్ స్వాగత సమితి బాధ్యులు డాక్టర్ ఆకుల శైలజ, ముక్క రాజశ్రీ, డాక్టర్ నందికొండ శ్రీలక్ష్మిరెడ్డి, కంజర్ల శ్రీలత, డాక్టర్ అన్ని తిరుమల, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎక్స్‌ప్లోరికా వార్షికోత్సవం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: నగరంలోని ఎక్స్‌ప్లోరికా పాఠశాల 8వ వార్షికోత్సవం పారమిత హెరిటేజ్ పాఠశాలలో క్రియేటివిటీ ద స్పైస్ ఆఫ్ ది లైఫ్ అనే పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సంబల్ పూరి (ఒడిశా), గోన్ ఫిషర్ మెన్ (గోవా), ఆదివాసి (ఆదిలాబాద్), మే వాని (గుజరాత్), జర్వా (అండమాన్ నికోబార్), ఆఫ్రికన్ ట్రైబల్ నృత్యాలతో అలరించారు. జ్యోతిప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించిన పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ ఈ వేడుకలు పాఠశాల విద్యార్థులు సాధిస్తున్న నిరంతర అభివృద్ధికి తార్కాణమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, ప్రాచీ, వినోద్‌రావు, వియుఎం ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు శర్మిష్టబసు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రేటర్ విద్యానగర్ మున్నూరుకాపు కార్యవర్గం



గ్రేటర్ విద్యానగర్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: నగరంలోని గ్రేటర్ విద్యానగర్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్ష పదవికి కనకం అమర్‌బాబు, ర్యాకం సుధాకర్ పటేల్ పోటీపడగా కనకం అమర్‌బాబు గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు పోరెడ్డి నరేందర్, కామ అంజిబాబు, పెద్దపల్లి లక్ష్మణ్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా అట్టెపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా ఐల రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా తోట సునీల్, జవ్వాజి శ్యాంప్రసాద్, నందాడపు మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా పెరుక రాజేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వినయ్‌కుమార్ గూడ, కుదురు రవికుమార్, జుట్టు శ్రీని వాస్, కార్యవర్గ సభ్యులుగా ఉప్పు జలపతి, సానా కార్తీక్ కుమార్, తోట రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



ఆరోగ్య ఉప కేంద్రం భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్, ఫిబ్రవరి 11: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో ఎమ్మెల్యే ఆదివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 20లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర నూతన భవనానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అర్హులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారద, జిల్లా నాయకులు గోపు మల్లారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

● **ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా**

శంకరపట్నం: కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరుపున కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మత్స్యగి రీంద్ర స్వామి జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాత రకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నూతన పాలకవర్గానికి సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి పాల్గొన్నారు.

శ్రీచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఫిబ్రవరి11: స్థానిక శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఉత్సాహ భరితంగా సాగాయి. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత ముద్దసాని రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, జూనియర్ కళాశాలల డీన్ వి.జగన్‌మోహన్‌రెడ్డి, వివిధ క్యాంపస్ ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయండి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: నల్గొండ పట్టణంలో ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన చలో నల్గొండ బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పార్టీశ్రేణులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన తన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ నల్గొండ భారీ బహిరంగ సభ నిర్వహణకు సంబంధించి కరీంనగర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కృష్ణా నదిపై తెలంగాణ ప్రాజెక్టులు, నీటి హక్కులను హరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సంస్థ కేఆర్ఎంబికి అధికారాలు అప్పగించడం ద్వారా జరుగబోయే దుష్పరిణామాలను ఖండిస్తూ తెలంగాణ సమాజానికి వాస్తవాలను వివరించేందుకు నల్గొండ పట్టణంలో ఈ నెల 13న భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ భారీ బహిరంగ సభకు కరీంనగర్ నియోజకవర్గం నుంచి 2వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, కార్పొరేటర్లు బండారి వేణు, జంగిలి అయిలేందర్‌యాదవ్, గుగ్గిళ్ళ జయశ్రీ, గందె మాధవి, నాయకులు మేచినేని అశోక్‌రావు, జమీలొద్దీన్, సాబీర్ పాషా, షౌకత్ అలీ, సుంకిశాల సంపత్‌రావు, మడికంటి మారుతి పాల్గొన్నారు.

కరాటేకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

- టౌన్ ఏసీపీ గోపతి నరేందర్



ఏసీపీకి జ్ఞాపిక అందిస్తున్న డాక్టర్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11: కరాటేకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని కరీంనగర్ టౌన్ ఏసీపీ గోపతి నరేందర్ అన్నారు. ఆదివారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే క్రమశిక్షణకు నిర్వచనమన్నారు. క్రీడలను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలన్నారు. విజేతలైన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

భగత్‌నగర్, ఫిబ్రవరి 11: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపోయే నిధులు కేటాయించక అన్యాయం చేశారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మైనారిటీ నాయకుల క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మైనార్టీ నాయకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 11: బడ్జెట్‌లో మైనారిటీల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించినందుకు ఇందిరాచౌక్ వద్ద నగర మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోరుకుంటుందని విద్య, వైద్యంతో పాటు గ్రామీణ, పట్టణ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించారని, మైనారిటీల సంక్షేమానికి గతంలో కంటే అధిక నిధులు కేటాయించారని అన్నారు. కార్యక్రమంలో శ్రవణ్ నాయక్,ఎండి చాంద్,అబ్దుల్ రెహమాన్,లయక్, ఖమ్రొద్దీన్,దన్నసింగ్, షబానా మహమ్మద్, జీడి రమేష్, సిరాజోద్దీన్, బషీర్, బొబ్బిలి విక్టర్, ఫజల్, ఫిరోజ్, ముక్క భాస్కర్, నదీమ్, మెరాజ్, సోహెల్, కుర్ర పోచయ్య, నెల్లి నరేష్, జ్యోతి రెడ్డి, మహాలక్ష్మి, రజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిలించే కలం కందుకూరి అంజయ్యది

- 'కదలిక' వ్యాసాల పుస్తకావిష్కరణలో డాక్టర్ నందిని సిధారెడ్డి



పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11: సమాజంలో కదలికను తీసుకరాగలిగినంత కవిత్వం కందుకూరి అంజయ్యదని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం అంబేద్కర్ పూలే పెరియార్ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో రచయిత, చేనేత-జౌళి శాఖ విశ్రాంత ఉపసంచాలకుడు కందుకూరి అంజయ్య రచించిన 'కదలిక' సాహిత్య వ్యాసాల పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏపీపీ అధ్యయన వేదిక ఆశయాలను దేవి యాదగిరి వివరించారు. బూర్ల వేంకటేశ్వర్లు, ఆర్ వేంకటేశ్వర్‌రావు మాట్లాడగా కాడె శంకరయ్య అంబేద్కర్‌పై గీతాన్ని ఆలపించారు. పుస్తకాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్‌కు అంకితమిచ్చారు.

'స్మార్ట్‌సిటీ' అవినీతిపై ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: కరీంనగర్ ప్రజలపై గౌరవం, చిత్తశుద్ధి ఉంటే స్మార్ట్‌సిటీలో జరిగిన అవినీతి, నిధుల మళ్లింపుపై ప్రత్యేక కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఆదివారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌సిటీలో అవినీతి జరిగిందంటూ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌పై నిరాధారమైన అసత్యపు ఆరోపణలు చేయడం కేవలం రాజకీయ లబ్ధికోసమేనని ఖండించారు. సంజయ్‌పై చేసిన వాఖ్యలను వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ వెనక్కితీసుకొని ప్రత్యేక కమిటీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీపీఆర్‌ను బహిర్గతం చేయకుండానే స్మార్ట్‌సిటీ పనులు ప్రారంభించారని, నగర నడిబొడ్డున టవర్‌సర్కిల్‌కు సమీపంలోని కొన్ని డివిజన్లకు స్మార్ట్‌సిటీ నిధులు కేటాయించకుండా రాజకీయవివక్షత చూపి స్మార్ట్‌సిటీ నిబంధనలకు విరుద్ధంగా విలీన గ్రామాలైన రేకుర్తి, పద్మనగర్‌తో పాటు బొమ్మకల్ పంచాయతీ పరిధిలో నిధులు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భూఆక్రమణ దందాలకు పాల్పడ్డారని విమర్శించారు. ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులపై, చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు బంగారు రాజేంద్రప్రసాద్, రాపర్తి ప్రసాద్, బొంతల కల్యాణ్‌చంద్ర, శివరాజ్, ఎడమ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను సన్మానించిన వొడితెల ప్రణవ్
- ఇల్లందకుంటలో ప్రత్యేక పూజలు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ వెంకట్, వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 11: హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం మొదటి సారిగా నియోజకవర్గానికి వచ్చిన ఎన్ఎస్ఐయూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ప్రణవ్ ఘన స్వాగతం పలికారు. వెంకట్‌ను ప్రణవ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని సింగాపూర్ గ్రామంలోని తన స్వగృహంలో ప్రణవ్ ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు వెంకట్ హాజరయ్యారు. ప్రణవ్ మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్సీని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ వెంకట్ మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొల్లూరి కిరణ్, పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పుష్పలత పాల్గొన్నారు.

ఇల్లందకుంట: హుజూరాబాద్ అభివృద్ధికి ప్రణవ్‌కు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్‌తో కలిసి ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేషం వంశీధరచార్యులు పూర్వకుంభంతో స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి, స్వామి వారి ఫొటో అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కోట నుంచి 50లక్షల రూపాయలు హుజూరాబాద్ నియోజకవర్గానికి కేటాయిస్తానన్నారు. మొదటి సారిగా మండలానికి వచ్చిన బల్మూరి వెంకట్‌కు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు. తనంతరం మల్యాల గ్రామంలో సుమన్ అనే యువకుడు ప్రమాదంలో గాయపడగా ఎమ్మెల్సీ పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇంగిలే రామారావు, నాయకులు అరుకాల వీరేశలింగం, గూడేల సారంగపాణి, రామకృష్ణ, పెద్ది కుమార్, పొనగంటి మల్లయ్య, పుష్పలత, సుశీల, రవి, శ్రీధర్, సత్యం, సంతోష్, సలీం, సదయ్య, రమేష్, నాగరాజు, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత మొదటి సారి వొడితెల ప్రణవ్‌తో కలిసి జమ్మికుంట వచ్చిన బల్మూరి వెంకట్‌కు మోత్కుల గూడెం చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాకు చేరుకున్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రాష్ట్ర స్థాయి అవార్డుకు విద్యార్థిని ఎంపిక

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 11 : మండలంలోని సింగాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బొజ్జ వైష్ణవి అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపతి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. బోరు బావులలో చిన్నారులు పడి చనిపోకుండా రక్షణ కవచం తయారు చేయాలన్న ఉద్దేశ్యంతో బోర్ లాక్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్‌ను రూపొందించిందని చెప్పారు. బోర్ లాక్ సహాయంతో బోరుబావులలో చిన్నారులు పడి చని పోకుండా ఉంటుందని విద్యార్థిని వివరించారు. వైష్ణవిని ఎంఈవో కేతిరి వెంకటనర్సింహారెడ్డి, గైడ్ టీచర్ లక్కాకుల రాంప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 11 : మండలంలోని జూపాక గ్రామాభివృద్ధికి ఎమ్మెల్సీ కోట కింద నిధులను కేటాయించాలని ఆదివారం హుజూరాబాద్‌కు వచ్చిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు జూపాక గ్రామ కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. జూపాక ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి నిర్మాణం కోసం, బస్టాండ్ నుంచి హైస్కూల్ వరకు సీసీ రోడ్డు, ఓపెన్ జిమ్, మిని లైబ్రరి కోసం నిధులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, నాయకులు ఇల్లందుల శ్రీనివాస్, మారేపల్లి ప్రసాద్, హరీష్, శ్యాంప్రసాద్, చందు, భరత్, గిన్నారపు అక్షయ్, చక్రి, బీఎస్పీ మండలాధ్యక్షుడు గిన్నారపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దు

చొప్పదండి, ఫిబ్రవరి 11: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ అన్నారు. రుక్మాపూర్‌లోగల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం పదో తరగతి, ఇంట ర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ భార్గవి సంస్థ సభ్యులు గోగొరి శ్రీధర్‌రెడ్డి, శ్రీముఖి, శ్రీనాయన్ తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగుతో అదనపు ఆదాయం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 11: నూనెగింజల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవ చ్చని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. మండలంలోని నేదునూర్ గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాగు చేస్తున్న తెల్ల కుసుమ పంటను పరిశీలించారు. నూనె గింజల సాగు ప్రోత్సాహంలో భాగంగా భారతీయ నూనె గింజల పరిశోధనా కేంద్రం రాజేంద్రనగర్ రైతులకు అధిక దిగుబడి నిచ్చే ఐఎస్ఎఫ్ -746 రకం కుసుమ విత్తనాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారులు ఆదర్శ రైతులు శ్రీకాంత్‌రెడ్డి, అనూష, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న మొక్కలు



వెన్నంపల్లిలో ఎండిపోతున్న మొక్కలు

సైదాపూర్, ఫిబ్రవరి 11: మండలంలోని పలు గ్రామాలలో హరితహారంలో నాటిన మొక్కలకు నీరు అందకపోవడంతో ఎండిపోతున్నాయి. హరితహారంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలని గత ప్రభు త్వం ఆదేశించింది. గ్రామాలకు లక్ష్యం విధించింది. కొన్ని చోట్ల మొక్కలు నాటినా వాటి సంరక్ష ణకు చర్యలు తీసుకోక పోవడంతో ఎండిపోతున్నాయి. మరో కొన్ని గ్రామాల్లో మొక్కలు నాటకుండా పడవేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజల సమస్యలు పరిష్కరించాలనే ఉద్ధేశ్యంతో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించామని, జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఏ కష్టం వచ్చినా కార్యాలయంలో చెప్పుకోవచ్చని, వాటిని జిల్లా నాయకులు పరిష్కరిస్తారని అన్నారు. కార్యక్రమంలో రీజియన్ బాధ్యుడు శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి హరీష్‌గౌడ్, నరేశ్, జిల్లా అధ్యక్షురాలు సాధన తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న హర్షనీయం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11: మాజీ భారత ప్రధాని, బహుభాషావేత్త పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం పట్ల కరీంనగర్ తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. హర్షం వ్యక్తం చేసిన వారిలో సంఘ బాధ్యులు సామల లక్ష్మీనరసయ్య, ప్రేంసాగర్, శేఖర్, శ్రీనివాస్, మల్లేశం, నాగరాజు, విజయ్, తిరుపతి, అరుణ, కళావతి తదితరులున్నారు.

బీసీలకు మొండి చేయి చూపిన కాంగ్రెస్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రతి బడ్జెట్‌లో 20వేల కోట్లను బీసీలకు కేటాయిస్తామని చెప్పి బడ్జెట్‌లో ఆ మేరకు నిధులు కేటాయించకుండా బీసీలకు మొండి చేయి చూపారని యునైటెడ్ పూలే ఫోరం (యుపిఎఫ్)రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరి ప్రసాద్ ఒక ప్రకటనలో విమర్శించారు. కేవలం అంకె లు మార్చి అంకెలు పెట్టి బీసీల బతుకులు రోడ్డున పడేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఉందని అన్నారు. ఇప్పటికైనా బీసీ కుల సంఘాలు, మేధావులు, నాయకులు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని గుర్తించి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

ఘంటశాల 50వ వర్ధంతి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11: నగరంలోని వావిలాలపల్లిలో స్వరమాధురి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వంగ వేంకటేశ్వర్లు, సాన వేణు ఆధ్వర్యంలో ఆదివారం గాన గంధర్వుడు ఘంటశాల 50వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకులు వంగ వేంకటేశ్వర్లు, పెద్దపల్లి రాజ్‌కుమార్, కరుణాకర్, దుర్గాప్ర సాద్, వేముగంటి జితేందర్‌రావు గీతాలను ఆలపించగా కార్యక్రమంలో బెజ్జంకి రామబ్రహ్మం, పివి రామకృష్ణ, పట్టెం ఉమేందర్, శ్రీరామోజు కృష్ణకుమార్ పాల్గొన్నారు.

మార్కండేయ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11: మాఘ శుద్ధ తదియ సందర్భంగా సోమవారం శివభక్త మార్కండేయస్వామి జయంతి ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించా లని అఖిల భారత మార్కండేయస్వామి మాల ధారణలు, దీక్షల సేవాసమితి మార్గదర్శకుడు చిలుక నరసప్ప ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలీయులు సనాతన ఋషి సంప్రదాయాలను పాటిస్తూ సంస్కృతిని ప్రతిబింబించేలా శోభాయాత్ర జరుపాలని కోరారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 11: ఈ నెల16న నిర్వహించ తలపెట్టినదేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ గ్రానైట్ ఫ్యాక్టరీలు, ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్, కమాన్‌పూర్, ఎలగందల్ క్వారీల్లో హిందిలో ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

గన్నేరువరం, ఫిబ్రవరి 11: మండలంలోని జంగపల్లి గ్రామ పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మురారి, భూ శంకర్, రవీందర్, కేశవులు, అంజనేయులు, చక్రపాణి, అశోక్, పరమేశ్వర్, నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

గన్నేరువరం, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలో ప్రీమియం క్రికెట్ లీగ్ పోటీలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకుడు స్వామి, నిర్వహకులు మంగరాపు అరుణ్ సాయి, రాపోలు అరవింద్, లోహిత్, ముడికె అజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

గంగాధర, ఫిబ్రవరి 11: నల్లగొండ బహిరంగా సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఆదివారం ఆయన గంగాధరలో మాట్లాడారు. కాంగ్రెస్ చేతకాని తనం వల్లే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించి నల్లగొండకు తీవ్ర నష్టం చేస్తుందన్నారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా సభను విజయవంతం చేస్తామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గంగాధర, ఫిబ్రవరి 11: మండలంలోని ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీపీ శంకరయ్య కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఆచంపల్లికి చెందిన మాజీ ఎంపీపీ గంగాధర్ శంకర్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు.

సమ్మక్కకు ఎత్తు బంగారం

శంకరపట్నం/సైదాపూర్, ఫిబ్రవరి 11: శంకరపట్నం మండలంలో సామ్మక్క-సారక్క ఎత్తు బంగారాలు ఊపందుకున్నాయి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పేరున్న సమ్మక్క-సారక్కలకు ఆదివారం జోరుగా ఎత్తు బంగారాలు(బెల్లం, చక్కర) ఇచ్చారు.

● సైదాపూర్ మండల కేంద్రంతో పాటు వివిద గ్రామాలలో సమ్మక్క-సారక్క జాతరను పురస్కరించుకొని తల్లులకు భక్తులు తమ మొక్కుల నిమిత్తం ఎత్తు బంగారం(బెల్లం, చెక్కర) జోకుతున్నారు.

నియామకం

ఇల్లంధకుంట, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని రామస్వామి ట్రస్టు(వృద్ధాశ్రమం) నూతన అధ్యక్షుడిగా ఎలిమిళ్ల రాజేంద్ర ప్రసాద్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు రాజేంద్రప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు.

తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ

మానకొండూర్, ఫిబ్రవరి 11 : కరీంనగర్ సూర్య తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో మానకొండూర్‌లోని గుడ్ న్యూస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీలలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి సంతోష్ పాల్గొని ప్రతిభ కనబర్చిన 30 మంది బాలబాలికలకు బెల్టులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొంత మనోహర్, ఎస్. సంతోష్, సతీష్‌కుమార్, రాజేందర్, బాలబాలికలు పాల్గొన్నారు.